మహిళలను వేధిస్తే విడిచిపెట్టం



షీ టీమ్స్‌కు పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు

నాగోలు: మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు హెచ్చరించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత నెల 16 నుంచి 31వ తేదీ మధ్య మహిళలు, యువతులను వేధిస్తూ 108 మంది ఆకతాయిలు రాచకొండ షీ టీమ్స్ పోలీసులకు చిక్కారు. నిందితుల్లో 67 మంది మేజర్లు, 41 మంది మైనర్లు ఉన్నారు. వీరందరిపై పోలీసుల కేసు నమోదు చేశారు. వీటిలో ఫోన్ల ద్వారా వేధించిన కేసులు 29, వాట్సాప్ ద్వారా కాల్స్, మెసేజ్ చేసి వేధించిన కేసులు 18, సోషల్ మీడియా ద్వారా వేధించినవి 32, నేరుగా వేధించినవి 54 కేసులు ఉన్నాయి. వీటిలో 5 క్రిమినల్ కేసులు, 68 పెట్టీ కేసులు, 38 కౌన్సిలింగ్ కేసులు నమోదైనట్టు కమిషనర్ తెలిపారు. మంగళవారం ఎల్బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంపు ఆఫీసులో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో షీటీమ్స్‌కు పట్టుబడిన వారికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్ బాబు మాట్లాడుతూ, మహిళలను వేధించే పోకిరీలను రాచకొండ షీ టీమ్స్ పోలీసులు వదిలిపెట్టే ప్రసక్తే లేదని, మహిళలు నిర్భయంగా షీ టీమ్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలో తిరుగుతూ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని తెలిపారు. ఎవరైనా మహిళలను వేధిస్తే వెంటనే రాచకొండ వాట్సాప్‌లో నెంబర్ 8712662111కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్, ఏసీపీ వెంకటేశం, సీఐ పరశురాం, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి లబ్ధిదారుల వివరాల సేకరణ

ఆస్మాన్‌గడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో ప్రారంభం

సైదాబాద్: తెలంగాణ ప్రభుత్వం అందించనున్న మరో పథకం గృహజ్యోతి అమలు దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్న లబ్ధిదారుల వివరాల సేకరణను మంగళవారం నుంచి ఆస్మాన్‌గడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో ప్రారంభించారు. ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో కార్యాలయంలో హైదరాబాద్ సౌత్ సర్కిల్ సూపరింటెండెంట్ అబ్దుల్ రహ్మాన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్న పథకం లబ్ధిదారుల నుంచి నుంచి వారి ఆధార్ కార్డు, రేషన్‌కార్డుల (ఆహార భద్రతా కార్డులు) వివరాలు సేకరించాలని సూచించారు. ఈ ప్రక్రియను ఈనెల 15 లోపు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.



ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో అధికారులతో సమావేశమైన హైదరాబాద్ సౌత్ సర్కిల్ సూపరింటెండెంట్ అబ్దుల్ రహ్మాన్

ప్రతీ కనెక్షన్‌కు ఫోన్ నెంబర్‌ను అనుసంధానం చేయాలని, యజమాని పేరును కనెక్షన్ నుంచి తొలగించరాదని స్పష్టం చేశారు. వివరాల సేకరణ ఐచ్ఛికమే అని, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోకపోయినా వారి వివరాలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఈ హన్మంత్‌రెడ్డి, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



అమీర్‌పేట గ్రామంలో పర్యటిస్తున్న కిషన్‌రెడ్డి, నాయకులు

మహేశ్వరం: దేశ ప్రజలు మరోసారి మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. 'గావ్ చలో' (పల్లెకు పోదాం పదండి) కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండల పరిధిలోని అమీర్‌పేటలో పర్యటించారు. కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకెళ్తోందని అన్నారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 370 నుంచి 400 వరకు ఎంపీ సీట్లు గెలుపొంది మూడోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 500 ఏళ్ల రామ మందిర స్వప్నం మోదీతోనే సాకారమైందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో మెజార్టీ ఎంపీ స్థానాలు గెలిచి మోదీకి కానుకగా ఇస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తప్పుడు, అమలు కానీ హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేలా బీజేపీ ప్రజల పక్షాల కొట్లాడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, కిసాన్‌మోర్చా జాతీయ కార్యదర్శి బి.పాపయ్య గౌడ్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు తూళ్ల వీరేందర్ గౌడ్, వెంకట్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో బుధవారం దిగువ తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

◆ **ఉ 9 నుంచి 10.30 గంటల వరకు...**
వెంకటాద్రి నగర్, ఆస్మాన్‌ఘడ్ పరిసర ప్రాంతాలు.

◆ **ఉ. 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు...**
గడ్డిఅన్నారం, ఆస్మాన్‌గడ్, ఆర్‌డీ కాలనీ, వెంకటాద్రి నగర్ పరిసరాలు

◆ **మ. 2 నుంచి సా. 5 గంటల వరకు...**
రెడ్‌క్రాస్, గౌతం నగర్, చర్చ్, గడ్డిఅన్నారం, శాంతినగర్, లలితా నగర్, మధురాపురి, కృష్ణానగర్, మైత్రీనగర్ పరిసర ప్రాంతాలు.

కాంగ్రెస్‌తోనే విద్యార్థుల సమస్యలు పరిష్కారం

ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

సైదాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలు పరిష్కారమవుతాయని ఎన్‌ఎస్‌యూఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఐఎస్‌సదన్ డివిజన్ బాలాజీనగర్‌లో ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డికి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నోముల రవీందర్‌గౌడ్, సందీప్, శ్రీకాంత్, శివాజీ, రంజిత్, దీపు, యాదీ, వినీత్‌రెడ్డి, రాజు, ప్రశాంత్, మహేష్ పాల్గొన్నారు.



విష్ణువర్ధన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కార్మిక సమ్మెను విజయవంతం చేయండి

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్

మహేశ్వరం: ఈ నెల 16న చేపట్టనున్న గ్రామీణ బంద్‌లో ప్రతి ఒక్క కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, అంగన్‌వాడీ హెల్పర్స్, టీచర్స్ యూనియన్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం యూనియన్ సభ్యులు అధికారులకు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వంలో ప్రజలపై కార్పొరేట్, మతతత్వ, నిరంకుశ దాడి పెరుగుతుందని మండిపడ్డారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి, రైల్వే, రక్షణ, విద్యుత్ సహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చేసే చర్యలను మానుకోవాలన్నారు. ప్రతి కార్మికుడికి నెలకు రూ.26 వేలు, ప్రభుత్వ అలవెన్సులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ కోశాధికారి కవిత, సీఐటీయూ మండల కన్వీనర్ శేఖర్, అంగన్‌వాటీ టీచర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

10న ఆర్యవైశ్య సంఘం సమావేశం

హుడాకాంప్లెక్స్: గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 10వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు చింతల బాలరాజ్‌గుప్తా పేర్కొన్నారు. కర్మన్‌ఘాట్‌లోని శ్రీలక్ష్మీ కన్వెన్షన్‌హాల్‌లో నిర్వహించే సమావేశానికి ఆర్యవైశ్య సంఘం సభ్యులందరూ విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పరిశీలన

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్‌లోని ఓల్డ్ విలేజ్‌లో మంగళవారం ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత పరిశీలించారు. పనులు నాణ్యతగా చేయాలని గుత్తేదార్లను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణ, కుమార్, తదితరులున్నారు.

స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో లారీ సప్లయర్స్ అసోసియేషన్ సభ్యులు

మన్సూరాబాద్: లారీ సప్లయర్లు వ్యాపారం చేసుకునేందుకు వీలుగా ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో స్థలం కేటాయించాలని లారీ సప్లయర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఆ సంఘం నాయకులు మంగళవారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, గతంలో నగరంలో వ్యాపారం చేసుకొనే వారిమని, తర్వాత ఆటోనగర్‌కు తరలించారన్నారు. ఇప్పుడు ఆటోనగర్ నుంచి కూడా ఖాళీ చేయిస్తున్నారని, తాము వ్యాపారం చేసుకునేందుకు వీలుగా ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో స్థలం కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎవ్వరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో శ్రీనివాస్‌బాబు, శ్రీనివాస్ రావు, శంకర్, శేషు, యాసిన్, జగదీష్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయండి



ఆర్టీసీ కాలనీలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్ కుమార్

నాగోలు: కాలనీవాసులు ఇబ్బందులు పడకుండా డ్రైనేజ్ లైన్ పనులను త్వరగా పూర్తయ్యేలా చూడాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జలమండలి అధికారులకు సూచించారు. మంగళవారం కొత్తపేట డివిజన్ ఆర్టీసీ కాలనీలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైన్ పనులను కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్, సంబంధిత జలమండలి అధికారులు ఏఈ రామకృష్ణారెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ, డ్రైనేజ్ లైన్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. కాలనీలో పగిలిన డ్రైనేజ్ పైపులైన్ మరమ్మతులు జరిగేలా చూడాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. రోడ్ నంబర్ 3 వాటర్ లైన్ 100 మీటర్ల వరకు పొడిగించాలని, పక్కనే ఉన్నటువంటి ఇళ్లకు తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అనంతరం కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పెంట రెడ్డి, యాదగిరి, లక్ష్మయ్య గౌడ్, శివ చారి, కృష్ణారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్ల కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 23, వంకాయ 18, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 40, క్యాబేజీ 23, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 23, దొండ 30–45, చిక్కుడు 23–35, గోకర 45, బీట్‌రూట్ 19, క్యాప్సికం 60, ఆలు 22, దోస 18, సొర 11, పొట్ల 13, ఉల్లిగడ్డ 19, చామగడ్డ 60.ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చాటిన నారాయణ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

దిల్‌సుఖ్‌నగర్: నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ లైవ్ ఇన్ హెల్త్ స్పేస్ పోటీల్లో ఆర్‌కేపురం నారాయణ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అంతరిక్షంలో పచ్చదనాన్ని పెంపొందించడంపై ప్రాజెక్టును రూపొందించారు. అంతరిక్షాన్ని ఏ విధంగా సస్యశ్యామలం చేయాలో తమ ప్రాజెక్ట్ ద్వారా ప్రదర్శించి అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చాటి మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా మంగళవారం నారాయణ స్కూల్ ఆర్‌కే పురం విభాగం ఏజీఎం హేమాంబర్, ఆర్‌డీ శివరంజని, కో ఆర్డినేటర్ రఫీ, ప్రిన్సిపాల్ నీరజ, అకాడమిక్ డీన్ మహేష్, ఏఓ రమేష్‌లు విద్యార్థుల ప్రతిభను కొనియాడి వారిని పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి సహకరించిన నాసా ఇన్‌చార్జ్ అరుణ, వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



ఎస్‌బీఐ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి, అధికారులు

హుడాకాంప్లెక్స్: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి పేర్కొన్నారు. మంగళవారం డివిజన్ పరిధి ఎస్‌బీఐ కాలనీలో జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్లపై మురుగునీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, మ్యాన్‌హోల్‌పై మూతలు ఉండేలా చూడాలని చెప్పారు. తాగునీరు కలుషితం కాకుండా, పైపులైన్ లీకేజీలపై దృష్టి పెట్టాలని సూచించారు. కాలనీవాసులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమస్యలు తలెత్తకుండా చూస్తానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జలమండలి జీఎం, డీజీఎం, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

భవన శిథిలాల డంపింగ్ అడ్డగింత

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువులో భవనాల శిథిలాలను డంప్ చేస్తున్న ట్రాక్టర్లను మంగళవారం నీటిపారుదల శాఖ అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ గంగరాజు మాట్లాడుతూ.. పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో భవనాల శిథిలాలు, మట్టిని డంప్ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. చెరువు వద్దకు వచ్చి డంప్ చేస్తున్న ట్రాక్టర్ల డ్రైవర్లను ప్రశ్నించగా, మున్సిపల్ అధికారులు చెప్పడం వల్లే డంప్ చేస్తున్నామన్నారు. వెంటనే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా, ఇకపై ఎఫ్‌టీఎల్‌లో డంప్ చేయకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారని వర్క్ ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

చిన్నారులను విద్యకు దూరం చేయొద్దు



సింగరేణి కాలనీని సందర్శించిన గీతం యూనివర్సిటీ సైకాలజీ విద్యార్థులు

సైదాబాద్: గీతం విశ్వవిద్యాలయానికి చెందిన సైకాలజీ విభాగం విద్యార్థులు మంగళవారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీని సందర్శించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి జీవనోపాధి కోసం నగరానికి వలస వచ్చి సింగరేణి కాలనీలో స్థిరపడిన వారి స్థితిగతులను వారు పరిశీలించారు. తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లినా తమ చిన్నారులను విద్యకు దూరం చేయవద్దని వారు గుడిసెవాసులకు సూచించారు. సోషల్ మీడియా ప్రభావంతో దురలవాట్లకు చేరువ కావద్దని యువకులకు సూచించారు. సింగరేణి కాలనీలో సేవ్ ఫౌండేషన్, యూత్ ఫర్ సేవ, దళిత మహిళా సంఘం అందిస్తున్న సేవలను వాటి ప్రతినిధులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న యూత్ ఫర్ సేవ సభ్యుడు అరవింద్ మాట్లాడుతూ, గీతం యూనివర్సిటీ విద్యార్థుల తరహాలో యువత వారంలో కొంత సమయం సమాజ హితం కోసం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సేవ్ ఫౌండేషన్ సభ్యులు పావని, శ్రీను, చరణ్, వంశీకృష్ణ, చిన్మయి పాల్గొన్నారు.

సీఎంకు క్షమాపణ చెప్పాలి

● కాంగ్రెస్ నాయకుల డిమాండ్ ● బాల్క సుమన్ దిష్టిబొమ్మల దహనం



ఎల్‌బీనగర్ ఏసీపీ జానకిరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న మధుసూదన్‌రావు, ఉపేందర్‌రెడ్డి, గణేష్



చైతన్యపురిలో బాల్క సుమన్‌పై ఫిర్యాదు చేస్తున్న ఉద్యమకారులు



ఎల్‌బీనగర్ శ్రీకాంత్ చారి విగ్రహం వద్ద బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మలక్‌పేట, ఎల్బీనగర్ జోన్ బృందం: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని మంగళవారం మలక్‌పేట, ఎల్బీనగర్ నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. చెన్నూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ సమావేశంలో బాల్క సుమన్ చెప్పు చూపించి దుర్భాషలాడటాన్ని వారు తీవ్రంగా ఖండించారు. పలు చోట్ల అతడి దిష్టిబొమ్మను దహనం చేశారు. బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలు పోలీస్‌స్టేషన్లలో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు.

◆ **మలక్‌పేట:** బాల్క సుమన్‌పై టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ బోనగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

◆ **చాదర్‌ఘాట్:** మలక్‌పేట కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ కార్యదర్శి బొల్లు కిషన్ ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

◆ **మన్సూరాబాద్:** ఎల్‌బీనగర్‌లోని శ్రీకాంతాచారి విగ్రహం వద్ద బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నేతలు దహనం చేశారు. అనంతరం అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కో ఆప్షన్ మెంబర్ మల్లారపు షాలిని తదితరులు పాల్గొన్నారు.

◆ టీపీసీసీ రాష్ట ఆదివాసి గిరిజన వైస్ చైర్మన్ కె.గాంధీనాయక్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లో నిరసన వ్యక్తం చేశారు.

◆ **చైతన్యపురి :** బాల్క సుమన్‌పై తెలంగాణ ఉద్యకారుడు దాము మహేందర్ ఆధ్వర్యంలో చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం చైతన్యపురి చౌరస్తాలో సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

◆ **హయత్‌నగర్:** డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గజ్జి శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

◆ **దిల్‌సుఖ్‌నగర్:** బాల్క సుమన్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, ఆలేటి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలోఎల్‌బీనగర్ ఏసీపీ జానకి రెడ్డికి ఫిర్యాదు చేశారు.

◆ **వైఖరి మార్చుకోవాలి**

నాగోలు: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ సేవా దళ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ షరీఫ్, ప్రధాన కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తపేట డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సుమన్ తన వైఖరి మార్చుకోకపోతే కాంగ్రెస్ నాయకులు తగ్గిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

సీనియర్ సిటిజన్ల సలహాలు, సూచనలు ఆదర్శం



ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: సీనియర్ సిటిజన్ల సలహాలు, సూచనాలను నేటి సమాజానికి ఆదర్శమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ కాలనీలోని సీనియర్ సిటిజన్ భవనంలో ఆదర్శ సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంఘం దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహి ంచారు. కార్యక్రమానికి హాజరైన నర్సింహారెడ్డి మాట్లాడుతూ, సీనియర్ సిటిజన్లు కుటుంబ సభ్యుల వలే కలిసి మెలిసి ఒకరికొకరు తోడుగా కార్యక్రమాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. సీనియర్ సిటిజన్లు మేము సైతం యువకులమంటూ క్రీడల్లో పాల్గొనడం సంతోషాన్ని ఇస్తోందన్నారు. కార్యక్రమంలో సోమిరెడ్డి, రాంరెడ్డి, మీరారెడ్డి, సత్యనారాయణ, రాంచంద్ర రెడ్డి, బ్రహ్మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణ విజయం పౌరాణిక పద్య నాటక ప్రదర్శన

వనస్థలిపురం: దర్శక, నటుడు ఆంధ్ర సాంబమూర్తి జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య, వేదభూమి సంస్థల ఆధ్వర్యంలో వనస్థలిపురం ఎన్జీఓస్ కాలనీలోని చంద్ర కళా వేదికపై బుధవారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీ కృష్ణ విజయం (పాండవోద్యోగంలోని ఘట్టాలు) పౌరాణిక పద్య నాటకంను ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాటకరంగ కళాభిమానులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

వ్యక్తి హత్య కేసులో భార్య, ప్రియుడికి జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత మార్చిన కేసులో మహిళతో పాటు ఆమె ప్రియుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.300 జరిమానా విధిస్తూ 2వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.భవానీ చంద్ర తీర్పు ఇచ్చారు. కోర్టు ఏపీపీ కస్తూరి తెలిపిన వివరాల ప్రకారం...షాహీన్ బేగమ్ (26)కు 12 ఏళ్ల క్రితం మహమ్మద్ సలీమ్ తో పెళ్లైంది. పిల్లలతో కలిసి పహాడీషరీఫ్ ప్రాంతంలో నివాసముండేవారు. లారీ నడుపుతూ కుటుంబాన్ని పోషించే సలీమ్ తాగుడుకు బానిసయ్యాడు.ఇదే అదునుగా తీసుకున్న భార్య మైలార్‌దేవ్‌పల్లికి చెందిన యూసుఫ్ ఖాన్ (34)తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. తమ అక్రమ సంబంధానికి అడ్డువస్తున్నాడని ప్రియుడితో కలిసి 2017 ఆగస్టు 15వ తేదీ అర్ధరాత్రి పహాడీషరీఫ్‌లోని తమ ఇంట్లోనే భర్తను హత మార్చింది. తనపై ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు భర్త ఇంట్లోనే చనిపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులకు షాహీన్ బేగంపై అనుమానం వచ్చి తమదైన శైలిలో విచారించగా యూసుఫ్ ఖాన్‌తో కలిసి హత్య చేసినట్టు ఒప్పుకుంది. నిందితులిద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన కోర్టు మంగళవారం నిందితులిద్దరికీ యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.300 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది.